## క్లుప్తంగా

### వేడుకగా గరుడోత్సవం



**నెల్లూరు రూరల్:** చింతారెడ్డిపాళెంలోని చెన్న కేశవస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా గరుడోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవాన్ని జరిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆనం విజయకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### భక్తిశ్రద్ధలతో చండీ పారాయణం

**బుచ్చిరెడ్డిపాళెం :** మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షి తాయి అమ్మవారి ఆలయంలో జరుగుతున్న మహాకుంభాభిషేక వేడుకల్లో భాగంగా నాలుగో రోజైన ఆదివారం చండీ పారాయణం కార్యక్రమాన్ని అర్చకులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యాగశాలలో ప్రత్యేక హోమాలను నిర్వహించారు. అనంతరం చండీ పారాయణం కార్యక్రమాన్ని జరిపించారు. దీంతో పాటు లఘుపూర్ణాహుతి, విద్యాహోమం, లలిత సహస్రనామార్చాన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ప్రశాంతిరెడ్డి, కొలన్ రాజారెడ్డి, పూజిత వ్యవహరించగా, ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, పాలక మండలి సభ్యులు నందకుమార్, రఘురామయ్య, శివకుమార్, విజయమ్మ, పద్మ, కామేశ్వరి, విమల, శశిశేఖర్‌శర్మ, కౌన్సిలర్ పుట్టా లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

**విజయేంద్ర సరస్వతి రాక నేడు**

ఆలయంలో జరిగే మహా కుంభాభిషేక వేడుకలకు కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి స్వామి సోమవారం రానున్నట్లు ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు తెలిపారు. మూడు రోజుల పాటు ఉండి కుంభాభిషేక వేడుకలను నిర్వహిస్తారని తెలియజేశారు.

### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**ముత్తుకూరు :** మండలంలోని బ్రహ్మదేవి జెడ్పీ హైస్కూల్‌లో 2000-2001 సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం కోలాహలంగా జరిగింది. అప్పటి హెచ్‌ఎం కె.కొండయ్య, ఉపాధ్యాయులు మాధవీలత, విజయలక్ష్మి, రామకృష్ణ, ప్రసాద్, మధుసూదన్, మల్లి తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 22 సంవత్సరాల తర్వాత కలుసుకున్న సుమారు 60 మంది సరదాగా గడిపారు. అప్పటి సంఘటనలు, అనుభవాలను గుర్తు చేసుకుని పొంగిపోయారు. తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని పులకించిపోయారు. నాటి విద్యార్థులు నలుబోలు చెంగయ్య, సన్నారెడ్డి సుమన, ఆరెద్దుల మనోహర్, నడవడి రమేష్, సురేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

### ఆరోగ్యంతోనే ఆనందమయ జీవితం

**మనుబోలు :** ఆరోగ్యంగా ఉంటేనే ఆనందమయ జీవనం సాధ్యమని నెల్లూరు యోగా మిత్ర మండలి అధ్యక్షుడు డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో యోగా మిత్ర మండలి నెల్లూరు వారి ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన సదస్సును ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో యోగా సాధన అలవర్చుకుంటే రోగాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. విచ్చలవిడి ఆహారపు అలవాట్లను మానుకోవాలని సూచించారు. మే 1 నుంచి 10వ తేదీ వరకు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సాయంత్రం 5 గంటలకు యోగా క్లాసులు నిర్వహిస్తామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యోగా మిత్ర మండలి ఉపాధ్యక్షుడు సీహెచ్ పెంచలయ్య, ఎం.రవీంద్ర, నిర్వాహకుడు రాజ, యోగా ట్రైనర్ కోటేశ్వరరెడ్డి ఉన్నారు.

### చిత్రలేఖన, కవితల పుస్తకాల పంపిణీ



**ఇందుకూరుపేట :** మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమంలో విద్యార్థులకు చిత్రలేఖనం, కవితల పుస్తకాలను ఆదివారం పంపిణీ చేశారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆశ్రమ కో–కన్వీనర్ నెల్లూరు రవీంద్రరెడ్డి కోరారు. తొలుత ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు జరిపారు. అనంతరం ఆశ్రమ ఆవరణలో గాంధీజీ విగ్రహానికి, స్థలదాత పాణకా కనకమ్మ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిటీ సభ్యులు వెంకటేశ్వరప్రసాద్, సిద్ధారెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, గణేశం సుమంత్‌రెడ్డి, మంజుల పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయం చూపాకే ఇళ్ల తొలగింపు

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



మాట్లాడుతున్న అనిల్‌కుమార్

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** పెన్నాపై నిర్మించనున్న రెండో బ్రిడ్జి, రోడ్డుకు సంబంధించి ఇళ్లు కోల్పోయే వారికి అండగా నిలుస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. 53, 54వ డివిజన్ల ప్రజలతో ఆత్మీయ సమావేశాన్ని ఇస్లాంపేటలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పెన్నాపై నిర్మించనున్న నూతన బ్రిడ్జి, రోడ్డు వెడల్పు కారణంగా 138 ఇళ్లను తొలగించే పరిస్థితి ఏర్పడనుందని, ఈ విషయమై సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించామన్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి కోవూరు షుగర్ ఫ్యాక్టరీకి సంబంధించిన స్థలాన్ని కేటాయించనున్నామని వివరించారు. ఇళ్ల విలువ బట్టి మెరుగైన పరిహారాన్ని అందిస్తామని వెల్లడించారు. 53, 54వ డివిజన్ల పరిధిలోని కొన్ని ఇళ్లు రైల్వే, పెన్నా పొరంబోకు స్థలాలుగా ఉండటంతో రిజిస్ట్రేషన్లు జరగడం లేదని, తాము అందజేయనున్న స్థలానికి రిజిస్ట్రేషన్ చేసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ప్రార్థన మందిరాలకు సైతం షుగర్ ఫ్యాక్టరీ స్థలంలో రోడ్డు పక్కనే స్థలాలు వచ్చేలా చూస్తామని తెలిపారు.

**దుష్ప్రచారాన్ని నమ్మొద్దు**

స్థలాలు.. పరిహారాన్ని ఇవ్వరంటూ కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వీరిని నమ్మొద్దని ఎమ్మెల్యే కోరారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేగా తాను విజయం సాధించడం తథ్యమని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను గెలిచిన రెండుసార్లు ఈ డివిజన్లలో మూడు వేల ఓట్ల మెజార్టీ వచ్చిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. కార్పొరేటర్లు సుజాత, సంఫియా, కో ఆప్షన్ సభ్యుడు జమీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ‘పెరసం’ వార్షికోత్సవం



గోపాలయ్య దంపతులను సత్కరిస్తున్న నిర్వాహకులు

**నెల్లూరు(బృందావనం):** పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ మందిరంలో పెన్నా రచయితల సంఘ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. పెన్నా రచయితల సంఘ రాష్ట్ర స్థాయి పెన్నా సాహిత్య పురస్కారాన్ని సుంకర గోపాలయ్య కవితా సంపుటి ‘మా నాయన పాట’కు అందజేశారు. అనంతరం గోపాలయ్య దంపతులు, లాయర్ వారపత్రిక ఉప సంపాదకుడు శ్రీనివాసులును సత్కరించారు. తొలుత కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఎస్వీ వర్సిటీ తెలుగు విభాగాధిపతి రవికుమార్, రచయిత్రి హైమావతి, పద్యకళాపరిషత్ అధ్యక్షుడు రామచంద్రప్రసాద్, కవి సునీల్, పెరసం వ్యవస్థాపక అధ్యక్షుడు పెంచలనరసింహం, అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, గౌరవాధ్యక్షుడు శివకుమార్, ప్రధాన కార్యదర్శి సులోచన, కార్యనిర్వాహక కార్యదర్శి సుభద్రాదేవి, కోశాధికారి లక్ష్మణరాజు, తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన



**నెల్లూరు(బృందావనం):** పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వార్షిక ఆరాధన మహోత్సవాన్ని విరాట్‌నగర్‌లోని వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం నిర్వహించారు. సుప్రభాతసేవ, అభిషేకాలు, చందనాలంకారం, గణపతిపూజ, పుణ్యాహవచనం, బ్రహ్మకలశ తీర్థం, సహస్రనామార్చన, తదితరాలను జరిపారు. సుమారు మూడు వేల మందికి అన్నప్రసాదాన్ని అందజేశారు. సహస్రదీపాలంకరణ సేవ, లక్ష్మీనారాయణ బృందంతో కోలాటం, గురుకృప కళాక్షేత్ర కళాకారుల ఆధ్వర్యంలో భరతనాట్యాన్ని ప్రదర్శించారు. నెల్లూరు పట్టణ విశ్వబ్రాహ్మణ సేవా సంఘ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షుడు చెంగయ్య ఆచారి, ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శి రమణయ్య, ఉపాధ్యక్షుడు శ్రీహరి, కోశాధికారి సురేష్ ఆచారి, సహాయ కార్యదర్శులు బాలచంద్ర, కృష్ణ, తదితరులు పర్యవేక్షించారు.

# మెగా రక్తదాన శిబిరం



సుబ్బారావును సత్కరిస్తున్న సభ్యులు

**నెల్లూరు(అర్బన్):** నవాబుపేటలోని మహాలక్ష్మమ్మ ఆలయం వద్ద మెగా రక్తదాన శిబిరాన్ని విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సుబ్బారావు జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఫౌండేషన్ అధ్యక్షురాలు కల్యాణి, లక్ష్మీప్రసన్న, తదితరులు పాల్గొన్నారు.

# డిప్యూటీ డెమో అధికారికి సత్కారం



**నెల్లూరు(అర్బన్):** మహ్మదాపురం పీహెచ్‌సీలో పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై డిప్యూటీ డెమో అధికారిగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి వచ్చిన కనకరత్నాన్ని హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. సంతపేటలోని హంస కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సుధాకర్‌రావు, ధర్మేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాన ట్రస్ట్‌కు విరాళం



**నెల్లూరు(బృందావనం):** నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థాన అన్నదాన ట్రస్ట్‌కు రూ.1.1 లక్షల విరాళాన్ని కొండాయపాళెం గేట్ సెంటర్‌కు చెందిన రమణయ్య, బుజ్జమ్మ దంపతులు ఆదివారం అందజేశారు. ఈ మేరకు ఈఓ వెంకటశ్రీనివాసులురెడ్డికి అందజేశారు. అనంతరం వారికి అమ్మవారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందజేశారు. దేవస్థాన ధర్మకర్తల మండలి సభ్యుడు దొరబాబు, ఉప ప్రధానార్చకుడు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# రచయిత్రి హైమావతికి అభినందన



**నెల్లూరు(బృందావనం):** నెల నెలా వెన్నెల సాహిత్య కార్యక్రమాన్ని మాగుంట లేఅవుట్లోని సన్నిధి ప్రచురణ సంస్థ కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్త్రీ వాద రచయిత్రి హైమావతిని సత్కరించారు. కవి పెరుగు రామకృష్ణ, నిర్వాహకులు భాస్కర్‌రెడ్డి, రచయితలు వెంకటప్పయ్య, కరుణశ్రీ, సుబ్రహ్మణ్యం, వీఆర్ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు ప్రభాకర్‌రెడ్డి, ఝాన్సీరాణి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# బ్రాహ్మణ వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన



మాట్లాడుతున్న వెంకటరామరాజు

**నెల్లూరు(బృందావనం):** బ్రాహ్మణులు శాఖాభేదాలను వీడి వివాహాలు జరుపుకోవాలని ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామరాజు పేర్కొన్నారు. ఆర్టీసీ సమీపంలోని డీఎస్సార్ కల్యాణ మండపంలో బ్రాహ్మణ వధూవరుల వివాహ పరిచయ వేదికను గాయత్రి కల్యాణమస్తు బ్రాహ్మణ ఉచిత వివాహ సమాచార కేంద్రం, ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, జిల్లా బ్రాహ్మణ సేవా సంఘాల సమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. వివాహ పరిచయ వేదికకు విశేష స్పందన లభించింది. సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కామేశ్వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మురళీకృష్ణ, మల్లికార్జునశర్మ, నాగరాజు, రాజేంద్రకుమార్, జయలక్ష్మి, ఉమా, నాగజ్యోతి, బాలాజీ, నరేష్, సంఘ జిల్లా అధ్యక్షుడు వాసుదేవరావు, తదితరులు పాల్గొన్నారు.

# మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



**నెల్లూరు(బృందావనం):** స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో మినరల్ వాటర్ ప్లాంట్‌ను దేవస్థాన పాలకమండలి చైర్మన్ మనోహర్, లక్ష్మి దంపతుల సహకారంతో ఏర్పాటు చేశారు. దీన్ని నుడా చైర్మన్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ ఆదివారం ప్రారంభించారు. దేవస్థాన పాలక మండలి కార్యదర్శి రామచంద్రరావు,, వెంకటసురేష్, సుబ్రహ్మణ్యం, శరణ్‌కుమార్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### పేకాట కేంద్రంపై పోలీసుల దాడులు

**నెల్లూరు సిటీ:** పేకాట కేంద్రంపై పోలీసులు దాడులు చేశారు. వివరాలు.. రాజేంద్రనగర్‌లోని ఓ ఇంట్లో పేకాటాడుతున్నారనే సమాచారం నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి అందింది. ఈ క్రమంలో ఆయన ఆదేశాలతో ఐడీ పార్టీ సిబ్బంది సాగర్, మణి, సంతపేట పోలీసులు దాడులు చేశారు. పేకాటాడుతున్న పది మందిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.12100ను స్వాధీనం చేసుకున్నారు.

### డివైడర్‌ను ఢీకొన్న వాహనం

**నెల్లూరు సిటీ:** డివైడర్‌ను ఐషర్ వాహనం ఢీకొన్న ఘటన నగరంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. మినీబైపాస్‌లోని ఓ షోరూమ్‌లో ఎలక్ట్రానిక్ వస్తువులను అన్‌లోడ్ చేసి తిరిగి విజయవాడ వెళ్లేందుకు గానూ వాహనాన్ని డ్రైవర్ తీశారు. అప్పటికే పూటుగా మద్యం సేవించారు. ఈ క్రమంలో రైల్వేస్టేషన్ వద్ద డివైడర్‌ను వేగంగా ఢీకొన్నారు. ప్రమాదంలో కార్పొరేషన్‌కు సంబంధించిన స్తంభాలు, సెంట్రల్ లైటింగ్ దెబ్బతినింది. ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

### క్రీడా దుస్తుల పంపిణీ



**నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట):** తిరుపతిలో నిర్వహించనున్న ఏపీ సీఎం కప్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్లను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా సెట్నెల్, జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ పుల్లయ్య మాట్లాడారు. 14 క్రీడాంశాల్లో పాల్గొనే 348 మంది క్రీడాకారులకు వీటిని అందజేశామని వివరించారు.

### చలివేంద్రం ప్రారంభం

**నెల్లూరు(అర్బన్):** ఆత్మకూరు బస్టాండ్ కూడలి వద్ద మజ్జిగ చలివేంద్రాన్ని అమ్మా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. నగరానికి చెందిన రమణమ్మ పేరిట కుటుంబసభ్యులు దేవకుమార్‌రెడ్డి, ఉమాదేవిరెడ్డి సహకారం అందించారు. ఫౌండేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు, సంస్థ సభ్యులు వంశీ, ప్రసాద్, ధనుష్, తదితరులు పాల్గొన్నారు.

### పాఠ్యాంశాల నుంచి తొలగింపు తగదు

**నెల్లూరు(మినీబైపాస్):** పాఠ్యాంశాల నుంచి మానవ పరిణామ వాదం అనే అంశాలను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని హేతువాద సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. ఈ మేరకు ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశాన్ని హేతువాద సంఘ నేతలు ఆదివారం నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, నేతలు రఘు, అనంత రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

### పార్వతీ హోమం రేపు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** నగరంలోని కస్తూరిదేవి గార్డెన్స్‌లో స్వయంవర పార్వతీ హోమాన్ని కంచి కామకోటి పీఠాధిపతి శంకర విజయేంద్రసరస్వతి పర్యవేక్షణలో మంగళవారం నిర్వహించనున్నామని యాదవ భవన్ ట్రస్ట్ జిల్లా మేనేజింగ్ ట్రస్టీ నాగకిషోర్‌యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం ఏడు గంటల నుంచి పూజా కార్యక్రమాలు ప్రారంభంకానున్నాయని చెప్పారు. యాదవులు సంప్రదాయ దుస్తులను ధరించి హాజరుకావాలని కోరారు.

# శ్రీశ్రీ జయంతి సభ



మాట్లాడుతున్న సుబ్బారావు

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** తెలుగువారు ఉన్న ప్రతి చోట, ప్రతి నోటా శ్రీశ్రీ పేరు వినిపిస్తుందని.. శ్రీశ్రీ అంటే తెలుగు సాహిత్యంలో ఒక విస్ఫోటనం అని కవి ఈతకోట సుబ్బారావు పేర్కొన్నారు. మహాకవి శ్రీశ్రీ జయంతి సభను నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించారు. శేషారెడ్డి విజ్ఞాన కేంద్రం, సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జేఎస్ ట్రస్ట్ బాధ్యుడు నరసింహారెడ్డి, సాహితీ స్రవంతి జిల్లా కార్యదర్శి గోపీనాథ్, నవకోటేశ్వరరావు, శ్రీహరి, గౌస్‌బాషా, విజయ్‌కుమార్, బలరామ్, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

# జెడ్పీ వాకర్స్‌కు సన్మానం



**నెల్లూరు రూరల్:** పొదలకూరు రోడ్డులోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పలువుర్ని జెడ్పీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సత్కరించారు. నిండు నూరేళ్లు వర్ధిల్లు కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్లో జన్మించిన వారిని సన్మానించారు. అనంతరం పేద మహిళ గౌసున్నీసాకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. నేతలు భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఖాజామస్తాన్, కృష్ణయ్య, అనంతరావు, ఎస్తేరురాణి, ఖాసిం, రత్నయ్య, రాజగోపాల్, వెంకటేశ్వర్లు, శరబయ్య, తదితరులు పాల్గొన్నారు.

# ‘మన్ కీ బాత్’ వీక్షణ



**నెల్లూరు(మినీబైపాస్):** ప్రధాని నరేంద్ర మోదీ ఆదివారం నిర్వహించిన మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను వీక్షించేందుకు వీలుగా ట్రంక్‌రోడ్డులోని శివాజీ సెంటర్‌లో భారీ స్క్రీన్‌ను బీజేపీ నేతలు ఏర్పాటు చేశారు. పార్టీ నేతలు సురేంద్రరెడ్డి, మిడతల రమేష్, రమణయ్య, సుబ్రహ్మణ్యం, కృష్ణ, సూర్యప్రకాష్, భాస్కర్ పాల్గొన్నారు.

• వేదాయపాళెంలోని దుర్గా నర్సింగ్ హోమ్‌లో కార్యక్రమాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్, దుర్గారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.